# బోల్తా కొట్టిన రిక్షా



## గోపీచంద్

గణ గణ గణ గణ...

ఒక బక్క చిక్కిన రిక్షావాడు బాగా బలిసి వున్న వ్యాపారస్తుణ్ణి తన రిక్షా మీద కూర్చోబెట్టుకొని లాక్కు వెళ్తున్నాడు. ఎంతదూరం నుంచి లాక్కు వెళుతున్నాడోగాని, తెగ రొప్పుతున్నాడు. అతని అడుగులు కింద వాలుతున్నట్లు లేవు. గాలిమీద తేలిపోతున్నాడు. రిక్షా ముందుకు వెడుతుంటే, తాను దాన్ని పట్టుకొని వేళ్లాడుతున్నట్లు అనిపించింది. వ్యాపారస్తుడికి మానవునికి వుండవలసిన అవయవాలన్నీ వున్నై. కాని వుండవలసిన మోతాదులో లేవు. బొజ్జ పెద్దది.

అందుకని కాళ్ళు బారచాచి, వెనక్కి ఆనుకొని, గోడకి నిలవేసిన తవుడు బస్తాలా కూర్చుని వున్నాడు. ఆ రిక్షావాణ్ణి, వ్యాపారస్తుణ్ణీ ఎక్కడో చూసినట్టు అనిపించింది నాకు. అనిపించటం, జ్ఞాపకం రావడం రెండూ ఇంచుమించు ఒకేసారి జరిగినాయి. ఆ రిక్షా భారతదేశం. రిక్షావాడు భారతదేశంలో వున్న మూర్తీభవించిన దారిద్ర్యం. ఆ వ్యాపారస్తుడు కేంద్రీకరించిన రొఖ్ఖం.

''ఆపరా'' అన్నాడు వ్యాపారస్తుడు.

రిక్షావాడు ఆగాడు. కొంతసేపటికి రిక్షా ఆగింది.

రిక్షాలోనే కూర్చొని వ్యాపారస్తుడు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అతను వాళ్ళ కొట్లో గుమాస్తా. ఆ వ్యాపారస్తునికి మూడు ఫ్యాక్టరీలు, రెండు బట్టల కొట్లూ, ఒక పెద్ద పచారీ షాపూ వున్నాయి. మొత్తం అతని వ్యాపారాన్ని బ్లాక్ మార్కెట్ వ్యాపారం అని పిలవవచ్చు.

''వాళ్ళకేం? వాళ్ళు అలాగే అంటారు, బ్లాక్ మార్కెట్టట! వ్యాపార ధర్మం తెలియకపోతే సరి. ఒచ్చేటప్పుడు రాబట్టుకోకపోతే, చెయ్యి దాటిన తర్వాత ఇమ్మంటే ఇస్తారా?'' అంటున్నాడు వ్యాపారస్తుడు.

''ముందీ ఆఫీసర్లతో వస్తున్నాం'' అన్నాడు గుమాస్తా.

''వాళ్ళ ముదుపుకోసం వాళ్ళు'' అని చీదరించుకున్నాడు ఆయన.

''చిత్తం'' అన్నాడు గుమాస్తా.

''వాళ్ళ నోళ్ళు మూతవెయ్యడం ఎంతసేపూ!''అన్నాడు ఆయన చిరునవ్వు నవ్వుతూ.

ఆయన మొహాన చిరునవ్వు కనపట్టం అన్నప్పుడల్లా జరిగేపని కాదు. నూటికి కోటికి ఒకసారి తళుక్కున మెరుస్తుంది.

గుమాస్తా ఆ దర్శన భాగ్యానికి ఉబ్బితబ్బిబ్బు అవుతూ ''చిత్తం, చిత్తం, తమరు తలచుకుంటే...'' అన్నాడు.

''నడవరా'' అన్నాడు ఆయన రిక్షావాణ్ణి. వాడు నడిచాడు. వాడి వెంటే రిక్షా నడిచింది.

గణ గణ... గణ గణ...

రిక్షావాడు బహు కష్టంమీద లాగుతున్నాడు. గుమాస్తాతో మాట్లాడిన తర్వాత వ్యాపారషుడు రెట్టింపు బరువెక్కాడు. కొంచెం దూరం వెళ్ళిన తరువాత ''ఆపరా'' అన్నాడు ఆయన మళ్ళీ.

రిక్షావాడు ఆగాడు. వెంటనే రిక్షా ఆగింది.

వ్యాపారస్తుడు రిక్షా మీద కూర్చొనే మరొకరితో మాట్లాడుతున్నాడు. ''ధరలు పెరిగేటట్లున్నాయి. మనకేం తొందరా'' అన్నాడు కొత్తమనిషి.

''స్టాక్ చెయ్యండి'' అన్నాడు ఆయన.

''చిత్తం. కాని ఈ అలగా జనం గోల పడలేకుండా వున్నాం'' అన్నాడు కొత్తమనిషి.

''వాళ్ళ దెప్పుడూ వుండే గోలే'' అన్నాడు ఆయన.

''చిత్తం. ఫ్యాక్టరీల చుట్టూ మిడతల దండుకు మల్లె మూగుతున్నారు''

''పోలీసుకి కబురు చెయ్యండి'' అన్నాడు ఆయన.

''చిత్తం'' అన్నాడు కొత్తమనిషి.

''నడవరా'' అన్నాడు ఆయన రిక్షావాణ్ణి. రిక్షావాడితో పాటు రిక్షా కదిలింది. ఈసారి ఆయన మూడు రెట్లు బరువెక్కాడు.

గణ... గణ... గణ... గణ!

రిక్షావాడు లాగలేక, లాగలేక లాగుతున్నాడు. రిక్షా కదల్లేక, కదల్లేక కదులుతూ వుంది.

''ఆపరా'' అన్నాడు ఆయన.

రిక్షా ఆగే వుంది.

ప్రక్కన ఆదుర్దాగా వెళుతున్న పెద్ద మనిషిని పిలిచి మాట్లాట్టం మొదలుపెట్టాడు ఆయన.

''కార్మికులూ, కమ్యూనిస్టులూ ఫ్యాక్టరీలను చుట్టు ముట్టారు'' అన్నాడు పెద్దమనిషి.

''కమ్యూనిస్టులా?'' అని భయపడ్డాడు వ్యాపారస్తుడు.

''ఆ!'' అన్నాడు పెద్దమనిషి.

''వాళ్ళకేం పనీ?'' అడిగాడు వ్యాపారస్తుడు.

''వాళ్ళే కార్మికుల్ని పోగు జేసింది'' చెప్పాడు పెద్దమనిషి.

''ప్రభుత్వం ఊరుకుందా?'' అడిగాడు వ్యాపారస్తుడు.

''పోలీసులను పంపించింది'' చెప్పాడు పెద్దమనిషి.

''వాళ్ళు ఊరుకున్నారా?''అడిగాడు వ్యాపారస్తుడు.

''తుపాకులు పేల్చారు'' చెప్పాడు పెద్దమనిషి.

''ఆ -?'' అన్నాడు వ్యాపారస్తుడు.

''పది మంది మరణించారు. పాతిక మందికి గాయాలు తగిలినై. వందమందిని అరెస్టు చేశారు'' అన్నాడు పెద్దమనిషి.

''కమ్యూనిస్టుల్నో?'' అడిగాడు వ్యాపారస్తుడు.

''గుంపంతా చెల్లా చెదురైంది'' అన్నాడు పెద్దమనిషి.



''ఫ్యాక్టరీలను పోలీసులు కాపలా కాస్తున్నారు''

వ్యాపారస్తుడు రిక్షాలో కూర్చునే ఆలోచించాడు. కమ్యూనిస్టుల్ని హతమార్చాలి. లేకపోతే తన నోట మట్టే. తన బ్రతుకు కత్తి మీద సాము అవుతుంది. 'ప్రభుత్వంలో అంతా మనకు తెలిసినవాళ్ళే. వాళ్ళ చెవిని ఒకమాట వేసి వొస్తే మంచిది' అనుకున్నాడు.

''నడవరా'' అన్నాడు రిక్షావాణ్ణి.

రిక్షావాడు ఒక గుంజు గుంజాడు. ఈ సారి వ్యాపారస్తుడు నాలుగు రెట్లు బరువెక్కాడు.

గణ గణ గణ గణ....

పక్కగా మనుషులు వెళుతున్నారు. బళ్ళు వెళ్తున్నై. కార్లు వెళ్తున్నై. రిక్షావాడు బరువు మొయ్యలేకపోతున్నాడు. రిక్షా లాగలేకపోతున్నాడు.

గణ గణ గణ గణ...

వ్యాపారస్తుడు ప్రభుత్వంవారితో ఎలా మాట్లాడవలసిందీ ఆలోచిస్తున్నాడు. కమ్యూనిస్టుల మీద ఏమి చెబితే వారికి నచ్చుతుందో ఊహించుకుంటున్నాడు... కమ్యూనిస్టులు ప్రధానమంత్రి మీద చేస్తున్న దుష్ప్రచారం, మొన్న మీటింగులో వాళ్ళు ఆయన్ని తిట్టిన తిట్లూ...

గణ గణ గణ గణ...

రిక్షావాడు ఊగిపోతున్నాడు. ఎదురుగా సైకిలు వచ్చింది.

''ఆ! ఆ!'' అన్నాడు వ్యాపారస్తుడు. భయంతో వెనక్కి వొరిగాడు. రిక్షావాడు అదిమి పట్టుకోలేక చేతులు వదిలాడు. రిక్షా తల్లక్రిందయింది. వ్యాపారస్తుడు బోర్లాబొక్కలా పడ్డాడు. రిక్షా విరిగింది. రిక్షావాడు కూలబడ్డాడు. వ్యాపారస్తుడు తన దెబ్బలు చూచుకొని కన్నీరు పెట్టుకుంటున్నాడు. రిక్షావాడికి తన సంగతి పట్టలేదు. ''అయ్యో! నా రిక్షో'' అని విలపిస్తున్నాడు- విరిగిన రిక్షాని తడుముతూ వాళ్ళని చూస్తుంటే, మూర్తీభవించిన దారిద్ర్యం భారతదేశానికి నష్టం కలిగిందని విలపిస్తున్నట్టూ, కేంద్రీకరించిన రొఖ్ఖం తనకు ఇబ్బంది కలిగిందని కన్నీరు పెట్టుకుంటున్నట్టూ అనిపించింది నాకు. ●